# కొర్లపహాడ్‌ను అభివృద్ధి చేస్తా

## ఎన్నారై ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి

కేతేపల్లి, డిసెంబరు 26 (న్యూస్‌టుడే): కేతేపల్లి మండలం కొర్లపహాడ్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని ఎన్నారై, అటా కోఆర్డినేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ స్వగ్రామాలను అభివృద్ధి చేయాలన లక్ష్యంతో అటా ఆధ్వర్యంలో 'గ్రామాలను దత్తత తీసుకోండి - అభివృద్ధి పరచండి' ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. కొర్లపహాడ్‌లో అటా ఆధ్వర్యంలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి ఈ నెల 27న జరిగే శంకుస్థాపన, ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కొర్లపహాడ్ సర్పంచి గుత్తా మంజులా మాధవరెడ్డి విజ్ఞప్తి మేరకు గ్రామంలో పాఠశాల నిర్మాణానికి నిధులు ఇస్తామని ప్రకటించారు. గ్రామంలో సిమెంట్‌రోడ్లకు కూడా అవసరమైన నిధులు ఇస్తామన్నారు. ఎన్నారైలు అందించే నిధులకు తోడు ప్రజాప్రతినిధులు ప్రభుత్వం నుంచి గ్రాంట్లు మంజూరు చేయించుకోవాలని సూచించారు. కొర్లపహాడ్ రామాలయ నిర్మాణానికి అటా అందించే రూ. 2 లక్షల చెక్కును గురువారం మంత్రి దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా దేవాలయ కమిటీకి అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, కొర్లపహాడ్ సర్పంచి గుత్తా మంజుల, రామాలయ కమిటీ ఛైర్మన్ ఏనుగుల లింగారెడ్డి, గుత్తా మధుసూదన్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ వెంకటేశ్వర్‌రావు, జి.జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**Courtesy Eenadu.**